
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





రంజాన్ వేళలు
ఇఫ్తార్ సాయంత్రం గంటల 6.23(శనివారం)
సహేరీ ఉదయం గంటల5.02 (ఆదివారం)



వలంటీర్లకు నజరానాలు..!



ఆత్మకూరు, మార్చి 15:
ఎన్నికలకు సిద్ధం అని సీఎం జగన్ అంటున్నప్పటికీ వైసీపీ శ్రేణులకు ఓటమి జ్వరం పట్టుకుంది. మళ్లీ అధికారంలోకి వస్తామా? అనే సందేహంతో నాయకులు చేయరాని పనులకు సిద్ధమవుతున్నారు. నిన్నటి దాకా తమ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో, జగన్ బొమ్మతో గెలుస్తామని ఢంకా బజాయించుకున్న వైసీపీ నేతలు ఇప్పుడు ఎట్లాగైనా గెలవాలని వలంటీర్ వ్యవస్థను పావుగా వాడుకోడానికి అడ్డదారులు తొక్కుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే శ్రీశైలం నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లకు నగదు నజరానాలతో ఎరవేసి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయాల ని వలంటీర్లకు వైసీపీ నేతలు డబ్బు పంచు తున్న ట్లు తెలుస్తోంది.

- ఆత్మకూరులో వైసీపీ డబ్బు పంపకాలు
- ఒక్కో వలంటీర్‌కు రూ.5 వేలు
- నాయకత్వం వహించే వారికి మరింత లబ్ధి
- చెప్పినట్లు వినకపోతే తొలగిస్తామని హెచ్చరిక
- ఓ వార్డులో వలంటీర్‌కు అదనం జీతం

శ్రీశైలం నియోజకవర్గంలో వైసీపీ నాయకులు గెలుపు కోసం వలంటీర్ల వ్యవస్థను వాడుకోడానికి బరితెగించినట్లు తెలుస్తోంది. ఆత్మకూరు మున్సిపాలిటీతో సహా అన్ని మండలాల్లో, గ్రామాల్లో వలంటీర్లకు డబ్బు ఎర వేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో వలంటీర్‌కు రూ.5వేలు, వారికి నాయకత్వం వ్యవహరించే వారికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఇప్పటికే నగదు చెల్లించినట్లు తెలిసింది. దీని కోసం ఆయా గ్రామ, వార్డుల పరిధిలోని ఓ నాయకుడి ఇంట్లోకి వలంటీర్లను పిలిపించి నగదు పంపిణీ చేసి వారికి ఎన్నికల్లో చేయాల్సిన ప్రచారం గురించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సమాచారం. ప్రతిపక్ష పార్టీలపై దుష్ప్రచారాలు చేయాలని, వైసీపీ మళ్లీ అధికారంలోకి రాకపోతే సంక్షేమ పథకాలు అందవని ఓటర్లకు రహస్య ప్రచారం చేయాలని సూచించినట్లు తెలిసింది. చెప్పినట్లు చేయని వలంటీర్లను మళ్లీ అధికారంలోకి వస్తే తొలగిస్తామని హెచ్చరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా వలంటీర్ల ప్రమేయం ఉండకూడదని ఎన్నికల కమిషన్ స్పష్టంగా చెబుతున్నప్పటికీ అధికార వైసీపీ నాయకులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. వలంటీర్లను వ్యవస్థను ఎన్నికల్లో ప్రచారానికి వాడుకునే ప్రయత్నం చేయడం విమర్శలకు దారితీస్తోంది.

టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తుపై ముస్లిం మైనార్టీ వర్గాల్లో చిచ్చుపెట్టేందుకు అధికార వైసీపీ నాయకులు వలంటీర్లను ఉపయోగించుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. బీజేపీ వల్ల ముస్లింలకు అన్యాయం జరుగుతుందని, బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీకి ఓట్లు వేయవద్దనే తప్పుడు ప్రచారాన్ని ముస్లిం మైనార్టీల్లోకి తీసుకెళ్లేందుకు కుట్ర పన్నుతున్నట్లు సమాచారం. వలంటీర్ల అధికారిక వాట్సాప్ గ్రూపుల్లోనే టీడీపీ, బీజేపీ పొత్తుపై

బీజేపీ పొత్తుపై మైనార్టీల్లో చిచ్చు పెట్టాలనే యోచన ..!

కొందరు వలంటీర్లు తప్పుడు ప్రచారం చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇదే క్రమంలోనే ఎస్సీలు, బీసీలు, ఇతర ఓటర్లను ఏవిధంగా ప్రసన్నం చేసుకోవాలన్న అంశాలపై వలంటీర్లకు ఎక్కడికక్కడ అవగాహన కల్పించినట్లు తెలిసింది. ఓవైపు సీఎం జగన్ మతం చూడం, కులం చూడం, వర్గం చూడమంటూ ఊదరగొడుతుంటే క్షేత్రస్థాయిలో ఆ పార్టీ నాయకులు మతాల, కులాల మధ్య చిచ్చురేపి ఓట్లను కొల్లకొట్టేందుకు కుట్రలు పడుతున్నట్లు కొందరు వలంటీర్లు కూడా చర్చించుకోవడం గమనార్హం.

మూడు నెలలుగా అదనంగా వేతనాలు

ఆత్మకూరు మున్సిపాలిటీలోని ఓ వార్డులో ఓ మహిళా ప్రజాప్రతినిధి భర్త మూడు నెలలుగా వలంటీర్లకు అదనంగా వేతనాలు చెల్లిస్తున్నట్లు తెలిసింది. తన వార్డు పరిధిలోని మొత్తం 13మంది వలంటీర్లకు నెలకు రూ.5వేల చొప్పున వేతనాలు ఇస్తున్నారు. ఈ వ్యవహారం అధికార పార్టీలోని సహచర కౌన్సిలర్లకు మింగుడుపడటం లేదు. డబ్బు వుందన్న అహంకారంతో ఓ వార్డులోని వలంటీర్లకు మాత్రమే అదనపు వేతనాలు ఇస్తే మిగతా వార్డుల్లో పనిచేస్తున్న వాళ్ల పరిస్థితి ఏంటని అధికార పార్టీ కౌన్సిలర్లే ప్రశ్నిస్తున్నారు. దీనిపై సదరు నాయకుడు స్పందిస్తూ నా డబ్బు.. నా ఇష్టం.. నేను ఇచ్చుకుంటానని చెప్పడంతో వారు మిన్నకుండిపోయారు. వాస్తవానికి ఆత్మకూరు పట్టణంలోని అనేక వార్డుల్లో గత మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలే ఎక్కువగా జరిగాయి. దీంతో ఓటర్లు ఎవరో వార్డు కౌన్సిలర్లకే తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ప్రజల వద్దకు ఏ ముఖం పెట్టుకుని వెళ్లాలో తెలియక వలంటీర్లతోనే ఓట్లను రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే తన వార్డులో అత్యధికంగా ఓట్లను సాధిస్తే నాయకుడి వద్ద మంచి పేరు ఉంటుందన్న ఉద్దేశంతోనే వలంటీర్లకు నెల జీతాలు ఇచ్చి మరీ ఎన్నికల ప్రక్రియలో వారిని వినియోగించుకో దలిచారనే విమర్శలు ఉన్నాయి.

మదనపడుతున్న పలువురు వలంటీర్లు

ఎన్నికల వేళ అధికార పార్టీ చేస్తున్న కుట్రలకు తాము ఎక్కడ బలవుతామోనన్న భయం పలువురు వలంటీర్లలో వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా వలంటీర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గితే ఏవైనా కేసుల్లో చిక్కుకుంటే తమ పరిస్థితి ఏమిటని పలువురు వలంటీర్లలో ఆందోళన మొదలైంది. అంతేకాకుండా ఓట్ల కోసం తప్పుడు ప్రచారం చేయాలని అధికార పార్టీ చేస్తున్న ఒత్తిళ్లపై వారు కూడా మదనపడుతున్నట్లు సమాచారం. పైగా చెప్పినట్లు విననివాళ్లను మళ్లీ అధికారంలోకి వస్తే తొలగిస్తామని వైసీపీ నాయకులు హెచ్చరికలు జారీ చేయడంపై మండిపడుతున్నారు. ఎన్నికల్లో వలంటీర్ల వ్యవస్థ ద్వారా వైసీపీ చేస్తున్న ప్రయత్నాలపై ఎన్నికల అధికారులు ఏవిధంగా వ్యవహరిస్తారో వేచిచూడాల్సిందే.

17న గ్రూప్-1 పరీక్షలు

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జేసీ ఆదేశం
- హాజరు కానున్న 3,675 మంది అభ్యర్థులు



సమావేశంలో పాల్గొన్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, అధికారులు

నంద్యాల (కల్చరల్), మార్చి 15: ఈనెల 17వ తేదీన జరిగే గ్రూప్-1 పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలలో ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలపై లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మజ, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, ప్రశాంత్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆదివారం గ్రూప్-1 సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్) పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలను 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు పరీక్షలు రెండు సెషన్‌లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల కోసం జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 3,675 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, ఏడుగురు లైజనింగ్ ఆఫీసర్లు, ఏడుగురు చీఫ్ సూపరింటెండెంట్లను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్షల రోజు జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ అనుమతి లేదన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ, మార్చి 15: ఎగువ, దిగువ అహోబిలాల్లో 12 రోజులపాటు ఘనంగా జరగనున్న అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఎగువ అహోబిలంలో శుక్రవారం వేదపండితులు అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సవాలలో దేవతలందరికీ ప్రీతి కల్గజేసి సకాలంలో వర్షాలు కురవాలని దేశం సుభిక్షంగా ఉండాలని, స్వామి వారి సర్వసైన్యాధ్యక్షుడి విశ్వక్షేణుడిని పుట్ట బంగారంతో చేసిన మంటపంలో కూర్చుండ బెట్టి యాగశాలలో అంకురార్పణ గావించారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ





సామి అమ్మవార్లకు ఊయల సేవ

శ్రీశైలం, మార్చి 15: శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం లేదా శుక్రవారం రోజున భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగం గా ఈ సంవత్సరం ఏప్రిల్ 26న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్విక బలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభ హారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజుల్లో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.



అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం మహా క్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహా గణపతి పూజ చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులను సమర్పించారు. శ్రీశైల క్షేత్రగ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది.

కర్నూలు డీఎంహెచ్‌వోగా డా.వై ప్రవీణ్ కుమార్



కర్నూలు(హస్పిటల్), మార్చి 15: కర్నూలు డీఎంహెచ్‌వోగా డా.వై.ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డా.బి. రామగిడ్డయ్యను విశాఖపట్నం రీజనల్ డైరెక్టరుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన్ను రిలీవ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ జనవరి 18వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆర్డర్స్ రావడంతో డా.బి.రామగిడ్డయ్య రిలీవ్ అయ్యారు. దీంతో కర్నూలు డీఎంహెచ్‌వో (ఎఫ్ఏసీ)గా డా.ప్రవీణ్ కుమార్ శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. డా.ప్రవీణ్ కుమార్ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా పని చేస్తున్న ఆయనకు డీఎంహెచ్‌వో (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ డైరెక్టర్ హెల్త్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఈయన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్ఎంవోగా 20 ఏళ్ల పని చేశారు.

టీడీపీలో చేరిన బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నంద్యాల పార్లమెంట్ బరిలో బైరెడ్డి శబరి?



చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆయన కూతురు శబరితోపాటు నంద్యాల జిల్లా ముఖ్య నాయకులు

నంద్యాల (ఆంధ్రజ్యోతి) మార్చి 15, నందికొట్కూరు: నంద్యాల ఎంపీ టీడీపీ టిక్కెట్ బైరెడ్డి డా.శబరికే ఖరారు అయినట్లు తెలుస్తోంది. దీంతో శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో హైదరాబాదులో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆయన కూతురు బైరెడ్డి శబరి టీడీపీలో చేరారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి చేరికతో నంద్యాల జిల్లాలో టీడీపీ బలం పెరిగినట్టయింది. ప్రధానంగా నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గాల్లో టీడీపీకి కలిసొచ్చే అవకాశం ఉంది. ఈసారి నంద్యాల పార్లమెంట్ బరిలో బైరెడ్డి డా. శబరిని దింపేందుకు టీడీపీ వ్యూహం రచించింది. విద్యావేత్త, విషయ పరిజ్ఞానం, నంద్యాల పార్లమెంట్‌పై పూర్తి స్థాయి అవగాహన కలిగిన బైరెడ్డి డా.శబరికి టిక్కెట్ కేటాయిస్తే గెలుపు తథ్యమన్న భావనలో టీడీపీ లెక్కలు వేసింది. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గాల్లో తనకంటూ ఓ వర్గం ఉంది. అలాగే బనగానపల్లె నియోజకవర్గం బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సతీమణి భారతి పుట్టినిల్లు. దీంతో బనగానపల్లె, నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో కూడా బైరెడ్డి శబరికి కలిసి వచ్చే అంశం. ఇలా ఈ లెక్కలతో బైరెడ్డి శబరికి నంద్యాల ఎంపీ టిక్కెట్ వరించింది.

అనూహ్యంగా రాజకీయ రంగ ప్రవేశం

ఉన్నతమైన కుటుంబం.. భార్యాభర్తలు ఇద్దరూ వైద్యులే... వారికి ఒక పాప... డాక్టర్ వృత్తిని కొనసాగిస్తున్న తరుణంలో కుటుంబంలో ఒక కుదుపుతో అనుకోకుండా రాజకీయ పగ్గాలు చేపట్టాల్సి వచ్చింది బైరెడ్డి శబరికి. ఎలాంటి అనుభవం, ఎవరి అండదండలు లేకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా 2014 ఎన్నికల్లో పాణ్యం నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. నాటి నుంచి తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ 2019 ఎన్నికల అనంతరం బీజేపీలో చేరారు. బీజేపీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ పార్టీ కోసం, ప్రజల కోసం ఆమె శ్రమించారు. అనతి కాలంలోనే నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ ప్రజా సమస్య ఎక్కడ తలెత్తినా అక్కడ ప్రత్యక్షమై వారికి అండగా నిలుస్తున్నారు. సేవలో తండ్రికి తగ్గ తనయ అని నందికొట్కూరు నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఇటీవలే బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినప్పటి నుంచి నంద్యాల జిల్లా వ్యాప్తంగా తిరుగుతూ ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ఆమె అవగాహన పెంచుకున్నారు. ఈ తరుణంలో వైసీపీ కంచుకోటగా ఉన్న నంద్యాల పార్లమెంటు సీటును గెలుచుకునే సత్తా బైరెడ్డి కుటుంబానికే ఉందని గ్రహించిన అధిష్టానం ఈ సారి ఆ కుటుంబానికి సంబంధించిన వారికే టిక్కెట్ కేటాయించాలన్న ఉద్దేశంతో విద్యావంతురాలైనటువంటి బైరెడ్డి శబరికి టీడీపీ టికెట్ ఖారారు చేశారు.

పంట ఉత్పత్తుల ధరలు ఢమాల్

కన్నీటి పర్యంతమవుతున్నరైతులు



మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన వేరుశనగ కాయలు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 15: కర్నూలు మార్కెట్ యార్డులో వివిధ పంట ఉత్పత్తుల ధరలు గత వారంతో పోలిస్తే.. తగ్గిపోతుండటంపై రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వేరుశనగ కాయలు కర్నూలు మార్కెట్ యార్డులో శుక్రవారం గరిష్ఠ ధర రూ.6,999కు తగ్గిపోయింది. మధ్యస్థ ధర రూ.6,009, కనిష్ఠ ధర రూ.3,636కు తగ్గిపోవడంపై రైతులు లబోదిబోమంటున్నారు. పూల విత్తనాల ధరలు కూడా పతనం అవుతున్నాయి. గరిష్ఠ ధర, మధ్యస్థ, కనిష్ఠ ధరలు కూడా రూ.1,210 పలికాయి. వాము ధర గత వారంతో పోలిస్తే రూ.3వేలకు పడిపోయింది. గరిష్ఠ ధర రూ.29,010, మధ్యస్థ ధర రూ.22,199, కనిష్ఠ ధర రూ.2,006కు తగ్గిపోయింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,111, మధ్యస్థ ధర రూ.1,959, కనిష్ఠ ధర రూ.1,300కు తగ్గిపోయింది. కందులకు గరిష్ఠ ధర రూ.9,869, మధ్యస్థ ధర రూ.1,959, కనిష్ఠ ధర రూ1,300కు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగలకు క్వింటానికి గరిష్ఠ ధర రూ.5,749, మధ్యస్థ ధర రూ.5,709, కనిష్ఠ ధర రూ.3,069కు చేరింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.1,459, మధ్యస్థ ధర రూ.1,381, కనిష్ఠ ధర ఘోరంగా రూ.297కు దిగజారడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఎండుమిర్చి గరిష్ఠ ధర రూ.17,009, మధ్యస్థ ధర రూ.13,007, కనిష్ఠ ధర రూ.1,899కు పడిపోయింది. మినుములకు గరిష్ఠ ధర రూ.8,089, మధ్యస్థ ధర రూ.9,069, కనిష్ఠ ధర రూ.8,205కు తగ్గిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

21 నుంచి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



మద్దికెర, మార్చి 15: మండలంలోని పెరవలి గ్రామంలో రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు తెలిపారు. 21వ తేదీ ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు, కలశస్థాపన, అంకురార్పణ, 22న శుక్రవారం సింహోత్సవం, 23న శనివారం శేషోత్సవం 24న లంకోత్సవం, 25న గరుడోత్సవం, 26న మంగళవారం గజోత్సవం, 27న తెల్లవారుజామున చిత్తా నక్షత్రంలో రంగనాథ స్వామి భూదేవి శ్రీదేవి కళ్యాణోత్సవం అనంతరం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అదే రోజు ఉదయం 9 గంటలకు రథం ముందు హోమం నిర్వహిస్తారు. కళ్యాణోత్సవానికి గ్రామానికి చెందిన పారా రామన్న కుమారులు పారా రామచంద్రప్రసాద్, పారా చిట్టిన్న స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తారు. అదే రోజు సాయంత్రం అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా రంగనాథ స్వామి రథోత్సవం ఉంటుంది. 28న అశ్వవాహనం, 29న హంసవాహనం, 30న పార్వుసేవ ఉంటాయి.

అన్ని ఏర్పాట్లు చేశాం: ఈవో చంద్రశేఖర్ రెడ్డి

రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ఉంటుంది.

ముగిసిన వాహనాల వేలం

రూ.3,19,662 ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న సెబ్ అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్

ఎమ్మిగనూరుటౌన్/రూరల్, మార్చి15: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వాహనాలను శుక్రవారం సెబ్ అధికారులు స్థానిక సెబ్ స్టేషన్ ఆవరణలో వేలం పాటలు నిర్వహించారు. సెబ్ అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సెబ్ సీఐ భార్గవరెడ్డి వేలం పాటలను నిర్వహించగా 20 మంది పాటదారులు వేలం పాటలో పాల్గొన్నారు. ఒక ఆటో, 15 ద్విచక్ర వాహనాలకు వేలం పాట పాడారు. జీఎస్టీతో కలుపుకొని మొత్తం రూ.3,19,662 ఆధాయం వచ్చినట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన అక్రమ మద్యం ధ్వంసం: ఎమ్మిగనూరు సెబ్ స్టేషన్ పరిధిలో ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తు పట్టుబడిన మద్యాన్ని శుక్రవారం మండలపరిధిలోని వెంకటగిరి రోడ్డులో ధ్వంసం చేశారు. సెబ్ అడిషనల్ ఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో 531లీటర్ల మద్యం, 5902 టెట్రాపాకెట్లను రోడ్డుపై వేసి వాహనంతో ధ్వంసం చేశారు. ఈ మద్యం విలువ రూ. 2,36,000 అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ భార్గవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద లావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకోండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 15: బ్యాంకుల ద్వారా ఎటువంటి అనుమానాస్పద లావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా.జి. సృజన బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకుల ద్వారా నగదు లావాదేవీలు, పోస్టల్ కార్డులు డిస్పాచ్‌పై బ్యాంకర్లు, పోస్టల్ సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎప్పుడైనా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల వ్యయ నిర్వహణ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు అమలులోకి వస్తాయని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, డీఆర్వో మధుసూదన్‌రావు, ఎల్‌డీఎం రామచంద్రరావు, డీసీవో రామాంజనేయులు, బ్యాంకర్లు, పోస్టల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 855 మంది విద్యార్థులు గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 15: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం శుక్రవారం జరిగిన పరీక్షకు 855 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20,294 మంది ఉన్నారని అన్నారు. వీరిలో 19,439 మంది పరీక్షకు హాజరు కాగా, 855 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారయ్యారని తెలిపారు. మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని ఆర్ఐవో తెలిపారు. పరీక్ష కేంద్రాలను కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ సౌరవ్‌గౌరు, కడప ఆర్జేడీ రవినాయక్, ఆర్ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో జమీర్‌పాషా, డీఈసీ సభ్యులు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు.

పూర్తయిన పరీక్షలు: ఇంటర్మీడియట్ మెయిన్ పరీక్షలు పూర్తయ్యాయి. మైనర్ మీడియా పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతాయి. పరీక్షలు ప్రశాంతంగా జరగడంపై ఇంటర్ బోర్డు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఆనందంతో గంతులేస్తూ కేరింతలు కొట్టారు. ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

రైతులూ.. ఆందోళన వద్దు

- ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా బ్యాంకు ఖాతాల్లో జమ
- జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 15: కర్నూలు జిల్లాలోని 24 మండలాల్లో జరిగిన పంట నష్టానికి రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.460.47 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని సీఎం జగన్మోహన్ రెడ్డి జమ చేశారని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం కింద ఇటీవల విడుదలైన రూ.4వేల మొత్తం కూడా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని అన్నారు.

ముగ్గురు పోలీసులపై వేటు

విధుల్లో అలసత్వం వహించారని సస్పెన్షన్

కర్నూలు, మార్చి 15: కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విధి నిర్వహణపట్ల అలసత్వం వహించిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ డీఐజీ విజయరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అవుకు పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం, కానిస్టేబుల్ నందునాయక్‌లను సస్పెండ్ చేశారు. ఇటీవల ఓ మహిళ అవుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భర్త శారీరకంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. అప్పుడు విధుల్లో ఉన్న సుబ్రహ్మణ్యం, నందునాయక్ ఆమెను స్టేషన్ నుంచి పంపించేశారు. భర్తను స్టేషన్‌ను పిలిపించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత మరుసటి రోజే భర్త చేతిలో ఆ మహిళ దారుణ హత్యకు గురైంది. విధుల్లో ఉన్న ఆ ఇద్దరు పోలీసుల నిర్లక్ష్యం వల్లే మహిళ హత్యకు గురైందని భావించి డీఐజీ వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే కర్నూలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేష్‌నగర్‌లో ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఏఎస్ఐ అయిన ఆమె మామ తిరుపాల్ నాయక్ ఆమెను అదనపు కట్నం కోసం వేధించేవాడని బంధువులు ఆరోపించి ధర్నా చేశారు. కోడలు మృతి విషయంలో తిరుపాల్ నాయక్‌పై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆయనను కూడా సస్పెండ్ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్నాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, మార్చి 15: కర్ణాటక రాష్ట్ర రిటైర్డు హైకోర్టు జడ్జి జస్టిస్ దినేష్ కుమార్ శుక్రవారం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈయనకు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. ఆయన గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎస్ఐ గోపినాథ్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్ ఆచార్, వ్యాసరాజాచార్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవరాయడికి విశేష పుష్పాలంకరణ

- రథాలపై ఊరేగిన ప్రహ్లాదరాయలు
- అలరించిన భరతనాట్యం



మంత్రాలయం, మార్చి 15: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం రాఘవేంద్ర స్వామి బృందావనానికి ఘనంగా విశేష పుష్పాలంకరణ చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవరాయలకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరా యలకు చెక్క, వెండి, బంగారు, గజవాహనం, నవరత్నాల రథాలపై ఊరేగించారు. అనంతరం నిర్వహించిన ఊంజల సేవ చేశారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ పండిత కేసరి రాజాఎస్ గిరిరాజాచార్, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, వాదిరాజాచార్, డీఎం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్యం

గురు వైభవోత్సవాల్లో భాగంగా 5వ రోజు యోగీంద్ర కళామండపంలో శుక్రవారం రాత్రి బెంగుళూరుకు చెందిన హాసికచే భరతనాట్యం కార్యక్రమం ఏర్పాటు చేశారు. తమిళనాడులోని సేలం చెందిన మెత్యూరు బ్రదర్స్ శాస్త్రీయ సంగీత కచేరీ చేశారు. ఈ కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నేడు రాఘవేంద్రస్వామి 429 జయంతి వేడుకలు

మంత్రాలయం రాఘవేంద్రస్వామి 429వ జన్మదిన వేడుకలు శనివారం వైభవంగా జరగనున్నాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంస్థాన పూజలు జరగనున్నాయి. తమిళనాడుకు చెందిన రాఘవేంద్రస్వామి నాదాహార సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 500 మంది సంగీత విద్వాంసులచే నాదాహార సమర్పణ సేవ నిర్వహించనున్నారు. టీటీడీ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనుంది.

విద్యా రంగంలో బీసీడీఈ విప్లవాలను తెస్తుంది

అవగాహన సదస్సులో వీసీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి

కర్నూలు(అర్బన్), మార్చి 15: ఉన్నత విద్యలో ప్రవేశపెట్టిన బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్(బీసీడీఈ) రాష్ట్ర ముఖచిత్రాన్నే మార్చేస్తుందని ఉపకులపతి బీ సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీ సెనేట్ హాలులో ఒక్క రోజు అవగాహన సదస్సులో ఉమ్మడి జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులలో సామాజిక బాధ్యతను మేల్కొలిపేలా, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో నిర్ధారిత అంశాల్లో పురోగతి సాధించేలా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని అన్నారు. బీసీడీఈ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రొఫెసర్ ఎంఎల్ ఎస్ దేవకుమార్ మాట్లాడుతూ కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టులో పాల్గొనడం ద్వారా ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులలో సామాజిక అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ అంకన్న, యూనిసెఫ్ కన్సల్టెంట్ వి. స్వాతిదేవి, శిక్షణా ఫౌండేషన్ ఆపరేషనల్ మేనేజర్ అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ అసమ్మతి నేతలతో గోరంట్ల మాధవ్ మంతనాలు

పత్తికొండ ఎమ్మెల్యే టికెట్‌పై మళ్లీ జోరందుకున్న చర్చలు



వైసీపీనాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డిని కలిసి మాట్లాడుతున్న గోరంట్ల మాధవ్

పత్తికొండ , మార్చి 15 : హిందూపురం ఎంపీ గోరంట్లమాదవ్ స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవితో పాటు పత్తికొండ ఎమ్మెల్యే టికెట్ రేసులో ఉన్న పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డితోపాటు నాగరత్నమ్మ కుటుం బాలతో వేర్వేరుగా మంతనాలు చేశారు. శుక్రవారం పత్తికొండకు వచ్చిన గోరంట్ల ముందుగా పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డిని ఆయన ఇంట్లో కలసి అరగంటపాటు మాట్లాడారు. అనంతరం సాయి దేవాయలయంలో రామచంద్రారెడ్డిని కలసి మాట్లాడారు. పత్తికొండ ఎమ్మెల్యే టికెట్ కోసం శ్రీదేవితోపాటు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి, మాజీమంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి కుమార్తె ఎస్ నాగరత్నమ్మ పోటీలో ఉన్న విషయం తెలిసిందే. ముగ్గురి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ముఖ్యమంత్రి మాట్లాడినా ఎవరికి వారు తమకే టికెట్ కావాలని ఆయనకు విన్నవించుకున్నారు. దీంతో టికెట్ విషయం పెండింగ్‌లో ఉండిపోయింది. దీనికితోడు కురువ సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న పత్తికొండ నియోజకవర్గం నుండి పోటీ చేయాలని గతంలో హిందూపురం ఎంపీ గోరంట్లమాదవ్ ఆ సామాజికవర్గం నిర్వహించిన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పత్తికొండ తిరునా ళ్లకు సైతం హాజరయ్యారు. తన నియోజకవర్గంలో ఆయన చేస్తున్న కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవి అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానానికి అప్పట్లో ఫిర్యాదు చేసినట్లు పార్టీవర్గాల భోగట్టా. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే అసమ్మతి వర్గాన్ని ఆయన కలిసి మాట్లాడడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కాగా పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తానని పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ-ప్రొసీడింగ్ ఆర్డర్స్



హెల్త్ అసిస్టెంట్‌కు ఈ-ప్రొసీడింగ్ ఆర్డర్స్‌ను అందజేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), మార్చి 15: ఉమ్మడి జిల్లాలో 136 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును రెగ్యులర్ చేస్తూ కర్నూలు డీఎంహెచ్‌వో బి. రామగిడ్డయ్య శుక్రవారం రాత్రి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ-ప్రొసీడింగ్ ఆర్డర్స్‌ను అందజేశారు. ఈ నెల 9న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు జారీ చేసిన ఆఫీస్ ప్రొసీడింగ్స్ స్థానంలో ఈ-ప్రొసీడింగ్ ఆర్డర్స్‌ను జారీ చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఉమ్మడి జిల్లాలోని కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణింపబడుతారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 136 మంది ఉద్యోగులకు 85 మంది మేల్ హెల్త్ అసిస్టెంట్లు, 46 మంది ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్లు, ఐదుగురు ల్యాబ్ టెక్నీషియన్లకు కొత్తగా ఈ-ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియ డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో నాగప్రసాద్, సెక్షన్ క్లర్క్ మురళి బ్రహ్మేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్లు గిరిధర్, మధుసూదన్, జూనియర్ అసిస్టెంట్లు రమేష్ ఆచారి పాల్గొన్నారు.

ప్రముఖులకు అవార్డులు



పండితులకు అవార్డులు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 15: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురు వైభవోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో ప్రముఖులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అవార్డులు ప్రదానం చేశారు. విద్వాన్ విరుపాక్షం, విజయవాడ రుగ్వేద పారాయణకర్త వేద పండితులు విరుపాక్ష శైవాక్ష మహర్షి, టీటీడీ ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ అండ్ ఆర్గనైజర్ విద్వాన్ అఖిల్ల విభీషణ శర్మ, బెంగుళూరు చెందిన మధుమేహం వైద్యనిపుణుడు డా. సంజయ్ అనంతక్రిష్ణ, న్యూఢిల్లీ మధ్వసాంగ ప్రెసిడెంట్ డా. మధుసూదన్‌రావు, ముంబైకి చెందిన సామాజిక సేవాకర్త అరుణాచార్య, బెంగుళూరు సామాజిక సేవాకర్త సురేష్ కుమార్, బెంగుళూరు చెందిన పరిమళ గిలియేరా బాలాగా జయసింహలకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రశంసాపత్రం, మెమెంటో, వెండి గిన్నె, రాఘవేంద్రస్వామి మెమెంటో, నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

లారీ, ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు దుర్మరణం



ప్రమాదంలో ఢీకొట్టిన లారీ, ట్రాక్టర్లు

మంత్రాలయం, మార్చి 15: మంత్రాలయం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద మహారాష్ట్రకు చెందిన లారీ, మంత్రాలయం చెందిన ట్రాక్టరు ఢీకొని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ రోడ్డు ప్రమాదం శుక్రవారం రాత్రి జరిగింది. మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ వివరాల మేరకు.. మంత్రాలయానికి చెందిన బడేసాహెబ్ ట్రాక్టర్‌కు డీజిల్ వేయించుకుని వస్తుండగా మంత్రాలయం నుంచి మాధవరం వైపు వెళ్తున్న మహారాష్ట్ర చెందిన లారీ ఢీకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ తెలుగు బడేసాబ్ (35), మహారాష్ట్రకు చెందిన సంపత్ సాహెబ్‌రావు (42) అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్, ఏఎస్ఐ ఆనందరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కోదండరామిరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రోడ్డుపైనే రెండు వాహనాలు ఢీకొనడంతో ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో రెండు వాహనాలను పక్కకు తొలగించి రాకపోకలు సాగించారు. లారీలో ఉన్న క్లీనర్ పరారయ్యాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మాసిస్టులు ఇకపై ఫార్మసీ ఆఫీసర్లు



ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసిన ఫార్మసీ ఆఫీసర్లు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 15: వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో ఫార్మాసిస్టులుగా పని చేస్తున్న ఉద్యోగులను ఫార్మసీ ఆఫీసర్లుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేడ్-2 ఫార్మాసిస్టును ఫార్మసీ ఆఫీసర్‌గా గ్రేడ్-1 ఫార్మాసిస్టును సీనియర్ ఫార్మసి ఆఫీసర్‌గా, గెజిటెడ్ హోదాతో పని చేస్తున్న ఫార్మాసి సూపర్‌వైజర్‌ను చీఫ్ ఫార్మసీ ఆఫీసర్లుగా పేరు మార్పు చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తర్వులను శుక్రవారం ఉదయం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వి.వెంకట రంగారెడ్డికి ఏపీ ఫార్మాసిస్టు అసోసియేషన్ జిల్లా కమిటీ అందజేసింది. ఈ పేరును మార్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ బి.నరసింహారావు, ఏపీ ఫార్మసిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, రాజేష్ నాయక్, బి.కృష్ణమోహన్ శర్మ, శ్రీనివాస్, వెంకటేశ్, దీప్తి, ఫార్మసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎన్నికల్లో జగన్ పాలనకు చరమ గీతం

కూటమి గెలుపు తథ్యం: బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), మార్చి 15: రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు జగన్ పాలనకు చరమగీతం పాడబోతున్నారని ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపి కూటమి గెలుపు ఖాయమని తెలిసి జగన్‌రెడ్డి భయంతో వణికిపోతున్నారని తెలిపారు. జగన్ రెడ్డి పాలనలో అక్రమ, అవినీతి పాలన ముగింపు దశకు చేరుకుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధంతో జగన్‌రెడ్డిని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

పొగాకు పంటను దహనం చేసిన దుండగులు

- బాధిత రైతు టీడీపీ మండల కన్వీనర్



కాలిపోయిన పొగాకు పంటను పరిశీలిస్తున్న నాయకులు

కర్నూలు(రూరల్)మార్చి15: కర్నూలు రూరల్ మండలం టీడీపీ కన్వీనర్ బోయ శివశంకర్‌నాయుడుకు చెందిన చేతికి వచ్చిన పొగాకు పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. రేమట గ్రామానికి చెందిన శివశంకర్ నాయుడు దాదాపు మూడెకరాల్లో పొగాకు పంటను వేశారు. పంట కాలం పూర్తి అయిన తర్వాత పొగాకు ఆకులను తెంపి పొలంలోనే తోరణాలు కట్టి ఎండబెట్టారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పొలంలోకి వెళ్ళి పొగాకు తోరణాలకు నిప్పుపెట్టారు. శుక్రవారం ఉదయం శివశంకర్‌నాయుడు సోదరులు పొలానికి వెళ్ళి చూడగా ఒక వైపు కట్టిన పొగాకు తోరణం పూర్తిగా కాలిపోయింది. దాదాపు 8క్వింటాళ్ల పొగాకు కాలి రూ. 7లక్షలు నష్టం సంభవించినట్లు శివశంకర్ నాయుడు తెలిపారు. కోడుమూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్, తదితరులు వెళ్లి పొలానికి వెళ్లి పరిశీలించారు. పార్టీ దృష్టికి తీసుకెళ్ళి శివశంకర్ నాయుడుకి న్యాయం జరిగే విధంగా చూస్తామని ఆకెపోగు ప్రభాకర్ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

- ఇద్దరి అరెస్టు, బైక్ సీజ్



అక్రమ మద్యం చూపుతున్న సెబ్ అధికారులు

పత్తికొండ, మార్చి 15: ఇతర రాష్ట్రాల నుంచి పత్తికొండ ప్రాంతానికి అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 20 ఫుల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంటు అడిషనల్ కమిషనర్ వినోద్ కుమార్, సెబ్ సీఐ సువర్ణలత తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పత్తికొండ మండలం హోసూరు వైపు నుంచి మోటారు సైకిల్‌పై మద్యం తీసుకువస్తున్న రామ్మోహన్, రాజు అనే వ్యక్తులను పత్తికొండ బైపాస్‌లో అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 20 మద్యం అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని ద్విచక్రవాహనం సీజ్ చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. కాగా నిందితుల్లో ఒకరు కర్నూలు ఏపీఎస్‌పీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. హర్యానా నుంచి అక్రమ మద్యం పత్తికొండకు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు తెలిసింది.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డీడీగా సాయిబాబా



బాధ్యతలు చేపట్టిన సాయిబాబాను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరు, మార్చి 15: ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్‌గా వి.సాయిబాబా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అలాన్ చోంగ్ టెరాన్ కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు డిప్యుటేషన్‌పై ఉత్తరఖండ్‌లోని డెహ్రాడూన్‌కు బదిలీపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో రాష్ట్రం అటవీశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వీ.సాయిబాబాను ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు. దీంతో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. డివిజన్ పరిధిలోని ఆయా రేంజ్‌ల అధికారులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. అలాగే ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. సాయిబాబా 2014 నుంచి 2016 వరకు ఆయన శ్రీశైలం ఏసీఎఫ్‌గా పనిచేశారు. ఈక్రమంలోనే ఐఎఫ్ఎస్ హోదాతో ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డీడీగా ఇక్కడికి వచ్చారు.

ఎంపీడీవోగా శివప్రసాద్ వర్మ



బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో శివప్రసాద్ వర్మ

ఆత్మకూరు రూరల్, మార్చి 15: ఆత్మకూరు మండల నూతన ఎంపీడీవోగా వైసీ శివప్రసాద్‌వర్మ పదవీ బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి ఉత్తర్వుల మేరకు ఆయన ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. వైఎస్సార్ కడప జిల్లా కోడూరు మండలం ఉపాధి హామీ పథకం ఏపీడీగా విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్ వర్మ ఆత్మకూరుకు బదిలీ కావడంతో ఆత్మకూరులో ఎంపీడీవోగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డిని వెలుగోడు మండలానికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

పంట నమోదు రసీదులు పొందాలి: డీఏవో



ఆర్బీకేలో రైతుల వివరాలు పరిశీలిస్తున్న డీఏవో

నంద్యాల రూరల్, మార్చి 15: రైతులు రబీలో నమోదు చేసుకున్న పంటలకు రైతు భరోసా కేంద్రాలలో రశీదులు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన పుసులూరు గ్రామాన్ని సందర్శించారు. ఆర్బీకేను తనిఖీ చేశారు. రబీ పంటల నమోదు రశీదులు పొందాలని రైతులను కోరారు. రైతు మ్యాగజైన్‌లు పంచారు. కొనుగోలు కేంద్రాలలో జొన్న ధాన్యం 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా జొన్న ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. జొన్న రైతులు ఆర్బీకేలలో దాన్యం కొనుగోలుకు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను కేంద్రంలో ఏర్పాటు చేశారు.

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

బండిఆత్మకూరు, మార్చి 15: మండలంలోని నారాయణపురం గ్రామంలో నారాయణస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల నిర్మాణాలకు సర్పంచ్ సరిత, భువనేశ్వరరెడ్డి భూమిపూజ నిర్వహించి, శంకుస్థాపన చేశారు. శుక్రవారం ఈవో నాగప్రసాద్ నేతృత్వంలో ముందుగా ఆలయనిర్మాణాల అంకురార్పణ పూజలు చేశారు. రూ.1.25 కోట్ల సీజీఎఫ్ నిధులతో నిర్మించనున్న పనులకు వారు శంకుస్థాపన చేశారు. త్వరితగతిన ఆలయ నిర్మాణాలు పూర్తి చేసి ప్రతిష్ఠ నిర్వహణ చేస్తామని ఈవో గ్రామ, ఆలయ కమిటీకి తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ ఛైర్మన్ మనోహర్‌చౌదరి, ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, లింగారెడ్డి, మల్లికార్జునరెడ్డి, వెంకటేశ్వర్లు, విష్ణు, నాగరాజు, అనంతయ్య, సుబ్బారావు, శంకర్, శీను పాల్గొన్నారు.

మహానంది: మహానంది ఆలయానికి అనుబంధ ఆలయంగా ఉన్న మండలంలోని తమ్మడపల్లి కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు శుక్రవారం మహానంది ఆలయ పాలకమండలి మాజీ ఛైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి దంపతులు భూమి పూజ నిర్వహించారు. దేవదాయశాఖ నుంచి ఆలయం పునః నిర్మాణ పనులకు సీజీఎఫ్ నిధుల క్రింద రూ. కోటి మంజూరు కావడంతో మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా ఆలయ వేదపండితులు భూమి పూజలు నిర్వహించారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాల మూల మఠంలో వెలసిన భీమేశ్వరస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణకు శుక్రవారం ఉదయం భూమి పూజ నిర్వహించారు. ఆలయ ఈవో రామాంజనేయ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భూమి పూజ కార్యక్రమానికి కౌన్సిలర్ భీమునిపల్లె పురంధర్, దేవ స్థానం మాజీ ఛైర్మన్ సన్నల వెంకటరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, కాళికాంబస్వామి దేవాలయం ఈవో లక్ష్మీనారాయణ, చెన్నా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని భూమి పూజ నిర్వహించారు. ఆలయ ఈవో రామంజనేయ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి: ఏవీ

నంద్యాల (కల్చరల్), మార్చి 15: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల పొత్తు కుదిరిన తర్వాత నిర్వహిస్తున్న మొట్టమొదటి ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నరసారావుపేట నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి అరవిందబాబుతో కలిసి ప్రజాగళం విజయవంతం చేసేందుకు రాష్ట్ర టీడీపీ అధిస్థానం తనను ఇన్‌చార్జిగా నియమించిందని చెప్పారు. దీంతో మా నియోజకవర్గంలో విశిష్టంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి గ్రామంలో జరిగే ప్రజాగళం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మార్కెట్ ప్రసాద్ దంపతులకు సత్కారం

నంద్యాల (కల్చరల్), మార్చి 15: శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు కూరగాయలను విరివిగా పంపిణీ చేసిన నంద్యాల మార్కెట్ ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులను శుక్రవారం శ్రీకాళహస్తిలో ఆలయ ఈవో నాగేశ్వరయాదవ్ ఘనంగా సత్కరించి, మెమెంటో అందజేశారు. కాళహస్తి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల ముగింపు పురస్కరించుకొని పాలకమండలి ఛైర్మన్ అంజూరి శ్రీనివాసుల ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులను ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా బ్రహ్మోత్సవాలకు గత కొన్ని సంవత్సరాలుగా విస్తృతంగా కూరగాయలు పంపిణీ చేస్తున్న ప్రసాద్ దంపతులను ఆలయ అధికారులు ఆహ్వానించారు. వేదికపై ప్రసాద్ దంపతులను వేదపండితులు ఆశీర్వదించారు. ఈవో స్వామివారి ప్రసాదాలు, మెమెంటో బహూకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ గంజి మల్లికార్జున ప్రసాద్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి: జేసీ

నంద్యాల (కల్చరల్), మార్చి 15: భారత ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలను అనుసరించి ఎన్నికల సమయంలో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో ఎన్నికల సమర్థవంత నిర్వహణపై సెక్టోరల్ అధికారులు బూత్ స్థాయి అధికారులు సూపర్‌వైజర్లు పోలీస్ సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం నిబంధనల ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లలో ఎక్కడైనా లోపాలు ఉంటే సరిచేయాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటులో లోపాలు ఉండరాదన్నారు. ఎఫ్ఎస్టీ, ఎంసీసీ, కంట్రోల్ రూమ్ సిబ్బంది, బీఎల్‌వోలు చేపట్టాల్సిన చర్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ రోజు ఓటర్లను గుర్తించడంతో పాటు ఓటర్ స్లిప్పులను ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు.



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సెక్టోరల్ అధికారులను సమన్వయం చేసుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో ఈఆర్వో, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, నంద్యాల ఆర్వో పరిధిలోని మండలాల అధికారులు, ఎఫ్ఎస్టీ, ఎంసీసీ, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ కవాతు



నందికొట్కూరు: కవాతు చేస్తున్న పోలీసులు, సాయుధ బలగాలు

మహానంది, మార్చి 15: వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మహానంది మండలంలో సమస్యాత్మక గ్రామాలైన సీతారామపురం, మసీదుపురంలో శుక్రవారం సాయుధ అదనపు పోలీస్ బలగాలు కవాతు నిర్వహించారు. డీఎస్పీ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో పోలీసులు కవాతు జరిపారు. అనంతరం డీఎస్పీ ప్రజల నుద్ధేశించి మాట్లాడారు రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు పాల్పడకూడదన్నారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.. ఈకార్యక్రమంలో రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐలు నాగేంద్రప్రసాద్, నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు..

నంద్యాల క్రైం: నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో పోలీస్-30 యాక్ట్ అమల్లో ఉందని నంద్యాల డీఎస్పీ ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నంద్యాల పోలీస్ సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్-30 యాక్ట్ అమల్లో



సీతారామపురంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఉందన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని అన్ని పోలీసు స్టేషన్లు, పాణ్యం, గడివేముల, బండిఆత్మకూరు, మహానంది, గోస్పాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ యాక్ట్ అమలులోకి వచ్చినట్లు ఆయన తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఉత్సవాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలంటే తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. పోలీసుల అనుమతి తీసుకోకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ఊరేగింపులు తదితర కార్యక్రమాలు చేపడితే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు

నందికొట్కూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నందికొట్కూరు పట్టణంలో పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బీఎస్ఎఫ్ సాయుధ బలగాలు పరిశీలించాయి. పట్టణంలో పట్టణ సీఐ ప్రకాష్ కుమార్, బీఎస్ఎఫ్ ఎస్ఐ మోహనరామ్ ఆధ్వర్యంలో 30 మంది సాయుధ బలగాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో కవాతు నిర్వహించారు. సీఐ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు రిగేవిధంగా చూడటమే తమ లక్ష్యమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు, రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు నిర్వహించామని చెప్పారు.

'విద్యార్థులకు జ్ఞానమే సంపద'

పాణ్యం, మార్చి 15: విద్యార్థులకు జ్ఞానమే సంపదని, విద్యార్థుల్లో సంకల్పం బలంగా ఉంటేనే ఎదుగుదల సాధ్యమని గుంతకల్లు రైల్వే డివిజన్ సీనియర్ రైల్వే మేనేజరు విజయచంద్రాచారి అన్నారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సాంకేతిక సదస్సు ప్రవాహ 2కే24 సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిత్వం, సంస్కృతి మరచిపోతున్నార న్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైనంత వరకే వినియోగించు కోవాలని కోరారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగం లేకుండా మానవ మనుగడ అసాధ్యమన్నారు. ఆలోచన విద్యుత్ ప్రవాహంలాంటిదని, మంచి కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ప్రవాహ సావనీర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ నాగభాస్కరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ లెనిన్, విజయసురేష్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

'బాలికలను గౌరవించాలి'

ఆత్మకూరు, మార్చి 15: ప్రతి ఒక్కరూ బాలికలతో గౌరవంగా మెలగాలని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటనర్సయ్య సూచించారు. శుక్రవారం ఆత్మకూరులోని కళాశాలలో 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలోని ఆడపిల్లలను అక్కచెల్లెలుగా భావించి మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ప్రత్యేకించి మైనర్ బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో యాక్ట్ లాంటి కఠిన చట్టాలు ఉన్నాయని హెచ్చరించారు. అదేవిధంగా బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి వాటిని ప్రోత్సహించిన వారు కూడా బాధ్యులేనని తెలిపారు. భ్రూణహత్యకు పాల్పడటం చట్టరీత్యా నేరమని అన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీవో లీలావతి, సూపర్‌వైజర్లు నాగేశ్వరమ్మ, సూర్యకుమారి, రమాదేవి, కవిత, టీబీ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ మస్తానయ్య తదితరులు ఉన్నారు.


అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, మార్చి 15: నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా దేవస్థానం శుక్రవారం సాయంత్రం లలితా నాట్య కళానికేతన్, ధర్మవరం బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, అదిగదిగో శ్రీశైలం, శివతాండవం, భో..శంభో, శివస్తుతి తదితర గీతాలకు రామలాలిత్య, వైష్ణవి, ఇందుప్రణతి, బాబు, బాలాజీ, కమలా, హర్షశ్రీ తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు. స్వామి,అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ధర్మపథం కార్యక్రమాలను దేవస్థానం చేపడుతోంది.

'పెండింగ్ క్లైమ్స్ చెల్లించాలి'



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు, మార్చి 15: భవన నిర్మాణ రంగం కార్మికులకు పెండింగ్ క్లైమ్‌లు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, నాయకులు సురేంద్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. నాలుగేళ్ల నుంచి భవన నిర్మాణ రంగ కార్మికులకు చెల్లించాల్సిన పథకాల పరిహారాలను తక్షణమే చెల్లించాలని అన్నారు. కాగా భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని కార్మిక శాఖ వివరాలు సేకరించి మూడేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా కార్మికులకు చెల్లించలేదని మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై కార్మికులు ప్రభుత్వంపై ప్రతిఘటించేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.

వైభవంగా కురుకులాంబదేవి వేడుకలు



హోమంలో పాల్గొన్న దంపతులు

ఆత్మకూరు రూరల్, మార్చి 15: ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబదేవి ఆలయంలో వార్షిక జయంతి ఉత్సవాలలో భాగంగా రెండో రోజైన శుక్రవారం శ్రీ సూక్త హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం వేద పండితులు వెంకటా చలపతి శర్మ ఆధ్వర్యంలో కురుకులాంబ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా షష్టీ శ్రీసూక్త హోమం నిర్వహించారు. హోమ పూజల్లో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పురోహితుడు కృష్ణమోహనశర్మ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చనలు, అష్టోత్తర పూజలు, సామూహిక సహస్ర నామ పారాయణ హోమాలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో చివరిరోజైన మార్చి 18వ తేదీన ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ఆవరణలో చండిహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు భక్తాదులకు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

నిలిచిన వేలం పాటలు

కొత్తపల్లి, మార్చి 15: కొత్తపల్లిలో గ్రామ పంచాయతీకి సంబంధించిన సంత మార్కెట్, రెండు షాపులకు శుక్రవారం నిర్వహించాల్సిన వేలంపాటలకు పాటాదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా పడ్డాయి. ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లిలోని స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న రెండు గ్రామ పంచాయతీ షాపులకు గత ఏడాది నిర్వహించిన వేలంపాటల్లో రూ.72వేలు, సంతమార్కెట్‌కు రూ.50,600లు ఆదాయం లభించినట్లు చెప్పారు. అయితే ఈ ఏడాది ఇదే సంతమార్కెట్‌కు వేలం పాట నిర్వహించగా.. కేవలం రూ.40వేలకు పాట ఆగిపోవడంతో ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. అలాగే రెండు షాపులకు వేలంపాట పెట్టగా రూములు వర్షాకాలంలో పూర్తిగా నీటితో కారుతోందని, వ్యాపార లావాదేవీలకు ఇబ్బందికరంగా ఉండటంతో ఎవరూ ముందుకు రాకపోవడంతో వీటికి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి, టీడీపీ నాయకులు మోహన్ యాదవ్ ఉన్నారు.

'గ్రూపు-1 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి'

పాణ్యం, మార్చి, 15: గ్రూపు-1 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో 696 మంది, శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో 600 ల మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్ తోపాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైన గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలన్నారు. అలాగే సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని చెప్పారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలన్నారు. పరీక్షల సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ముస్లింల ప్రార్థన

వెలుగోడు, మార్చి 15: వెలుగోడు పట్టణంలో రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలతో మసీదులు కిటకిటలాడాయి. ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలో మొదటి శుక్రవారం కావడంతో ప్రార్థన మందిరాలు ముస్లిం సోదరులతో కిక్కిరిసి పోయాయి. రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు ప్రతిరోజి ఐదుపూటలు నమాజు చేస్తారు.

చెక్కుల పంపిణీ

నంద్యాల (కల్చరల్), మార్చి 15: నంద్యాల కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నులుగురికి ఆర్థిక సహాయం నంద్యాల జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అందజేశారు. అనంతపురం పాతబస్తీకి చెందిన ముక్సన్‌కు ఓ వ్యాధి చికిత్స నిమిత్తం లక్ష రూపాయలు, అనంతపురం రోడ్డు ప్రమాదంలో మోకాలు వరకు తీసేసిన ఎస్ ఖాజాకు చికిత్స నిమిత్తం యాభైవేల రూపాయలు, ఆస్పరి మండలం చిన్న హోతూరు గ్రామ నివాసి సోమశేఖర్‌కు పేదరికం కారణంగా గృహనిర్మాణ నిమిత్తం లక్ష రూపాయలు, ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం, చిన్న ఓబులంపల్లి గ్రామానికి చెందిన బాలగురువయ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం తన భార్యకు లక్షరూపాయల చెక్కును జిల్లా కలె క్టర్ డా.కె.శ్రీనివాసులు అందజేశారు.

ప్రజల మధ్య సీఎం జగన్ చిచ్చు

● టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర



అభివాదం చేస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

నందికొట్కూరు, మార్చి 15: రాష్ట్రంలో కుల, మత ప్రాంతీయ విభేదాలు తీసుకువచ్చి ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న ముఖ్యమంత్రి జగన్‌లాంటి వ్యక్తిని పక్కన పెట్టేందుకు అన్ని శక్తులు ఒకటై పోరాడే సమయం ఆసన్నమైందని, అందుకే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఏకం కావాల్సి వచ్చిందని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. అల్లూరులో శుక్రవారం టీడీపీ, బీజేపీ, జనసేనల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. మాండ్ర మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య మాట్లాడుతూ అవగాహన కలిగిన స్థానిక దళిత నాయకులకే ఎమ్మెల్యే టిక్కెట్ ఇప్పించాలన్న ఆలోచనతో మాండ్ర శివానందరెడ్డి ఉన్నారని అందులో భాగంగానే 2019 ఎన్నికల్లో బండి జయరాజుకు టీడీపీ తరుపున, 2024 ఎన్నికల్లో తనకు సీటు కేటాయించారని ఆయన అన్నారు. బీజేపీ నాయకుడు దామోదర్‌రెడ్డి, జనసేన నాయకుడు రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపుకోసం టీడీపీతో కలిసి నడుస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు రవీంద్రారెడ్డి, నారపురెడ్డి, ఓబుల్‌రెడి, పట్టణాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన జయసూర్య



చంద్రబాబు నాయుడును కలిసిన గిత్తా జయసూర్య

నందికొట్కూరు, మార్చి 15: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం గిత్తా జయసూర్యను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాక చంద్రబాబుకు హైదరాబాదులో కలిశి కృతజ్ఞతలు తెలిపారు. బాబును కలిసిన వారిలో నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.

'రాష్ట్ర భవిష్యత్తు కోసమే పొత్తు'

ఆత్మకూరు, మార్చి 15: రాష్ట్ర భవిష్యత్ కోసమే బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు ఏర్పడిందని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ప్రచారకర్త కర్నాటి శ్రీరాములు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగన్ రెడ్డి పాలనలో లెక్కలేనన్ని నేరాలు, ఘోరాలు జరిగాయని ఆరోపించారు. ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాదుడుతో రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై రూ.8లక్షల భారం మోపారన్నారు. నాసిరకం మద్యంతో రూ.లక్ష కోట్ల కమిషన్ కొట్టేయడమే కాకుండా 30లక్షల మంది ఆరోగ్యాలను నాశనం చేసి, 30వేల ప్రాణాలను బలిగొన్నాడని ఆరోపించారు. కాగా మార్చి 17న చిలుకలూరి పేటలో జరిగే ప్రధానీ మోదీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వేణుగోపాల్, శివప్రసాద్‌రెడ్డి, కలీముల్లా, నాగూర్‌ఖాన్, సుదర్శన్, అరుణ్ తదితరులు ఉన్నారు.

'అరాచక పాలనకు చరమగీతం పాడాలి'

మహానంది, మార్చి 15: వచ్చే ఎన్నికలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ మహానంది ఇన్‌చార్జి గని చిన్న రంగస్వామి, సూరే శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి మహానంది సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో టీడీపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఒక్క చాన్స్ పేరుతో తెలుగు ప్రజలు ఎంతో మోసపోయారన్నారు.మరల అలాంటి అవకాశం సీఎం జగన్‌కు ఇవ్వవద్దన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, సుబ్బరాయిడు, రాముడు, రమణ, ఎల్లయ్య, భూపాల్, కార్తీక్, కైలాష్‌లు పాల్గొన్నారు.

ఆలయ పాలక మండలి ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన పాలక మండలి సభ్యులు

కొత్తపల్లి, మార్చి 15: దుద్యాల గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయ పాలక మండలి ఛైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం దుద్యాలలోని ఆలయంలో నంద్యాల డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పర్యవేక్షణలో ఈవో కార్తీక్ ఆధ్వర్యంలో ఎంపికైన పాలకమండలికి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఛైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి, ఆలయ ట్రస్టు సభ్యులుగా నాగేంద్రమ్మ, హరిత, ఈశ్వరమ్మ, రాజు, తిరుపతయ్య అలాగే ఎక్స్ అఫీషియో మెంబరుగా బాలసుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నుకున్న సభ్యులు రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగుతారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభలత, మాజీ సర్పంచ్ రఘురామిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, ట్రస్టు మాజీ ఛైర్మన్ పాములేటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'క్షమాపణ చెప్పాలి'

నందికొట్కూరు, మార్చి 15: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దార సుధీర్ క్షమాపణలు చెప్పకవడం అంటే అన్ని వార్గల వారిని అవమానించడమే అని, వెంటనే క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ లింగాల స్వాములు డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన జరిగిన మాలల ఆత్మీయ సమావేశంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దార సుధీర్ మాలల నియోజకవర్గం అని ఒక కులాన్ని ఎక్కువ చేసి నియోజకవర్గంలో ఉన్న ఎస్సీఎస్టీ, బీసీ ముస్లీం, మైనార్టీల ప్రజలను తక్కువ చేయడంపై క్షమాపణలు చెప్పాలని కుల సంఘాలు నిరసన చేపట్టినా ఆ విషయంపై ఎలాంటి స్పందన లేదన్నారు. ఒక కులం వారు ఓట్లు వస్తే ఎవ్వరూ గెలవరని, అన్ని కులాల ప్రజలు ఓట్లు వేస్తేనే గులుస్తారని అన్నారు. గతంలో పని చేసిన ఎమ్మెల్యేలు కులాల మధ్య చిచ్చుపెట్టకుండా ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా సేవ చేశారన్నారు. తక్షణమే ఈ విషయంపై నిర్లక్ష్యం చేయకుండ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని గ్రామాల్లో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, అనిల్‌లు పాల్గొన్నారు.

అహోబిలం చేరుకున్న పీఠాధిపతి



పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు

నంద్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అహోబిలం పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ శుక్రవారం అహోబిలం చేరుకున్నారు. ఆయనకు ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఎగువ అహోబిలం బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు

డోన్, మార్చి 15: చంద్రబాబు అధికారంలోకి వస్తే చదువుకునే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15వేల ఆర్థిక సాయం ఇస్తారని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని 22వ వార్డులో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మాన్ని నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కోట్ల నివేదిత మాట్లాడుతూ గత ఎన్నికల ముందు మద్యపాన నిషేధం అమలు చేస్తామని వైఎస్ జగన్ మాట ఇచ్చి మహిళలకు మోసం చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, భాస్కర్ నాయుడు, ఎస్ఎండీ రఫి, ఓంప్రకాష్, భాష్యం శ్రీధర్ గౌడు, టీఈ రాఘవేంద్రగౌడు, ఆర్ఈ నరసింహ, రంజిత్ కిరణ్, దిలీప్ రెడ్డి, మను, తాదురు వెంకటరమణయ్య, మర్రి మణి, చాటకొండ రజిని, ఎన్ఈ సరోజ, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, ఆర్మీ రామయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం కూటమి

డోన్, మార్చి 15: రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకుడు భాష్యం రమణగౌడు నివాసంలో కోట్ల నివేదిత ఆధ్వర్యంలో కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. కోట్రికే ఫణిరాజ్ మాట్లాడుతూ సీఎం జగన్ అరాచక విధానాలతో రాష్ట్రం అభివృద్ధిలో ఎంతో నష్టపో యిందన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతోనే చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నారన్నారు. ఈ నెల 17న చిలకలూరిపేటలో జరిగే ఉమ్మడి సభకు ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు హాజరవుతున్నారని, సభను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ నాయకుడు వడ్డె మహారాజ్, జనసేన నాయకుడు ఆలా మోహన్ రెడ్డి మాట్లాడారు. టీడీపీ నాయకులు ఓబు లాపురం శేషిరెడ్డి, భాస్కర్ నాయుడు, ఎస్ఎండీ రఫి, బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య కిరణ్, బొంకూరి రవికుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లు సిద్ధం: తహసీల్దార్

కోవెలకుంట్ల, మార్చి 15: మండలంలోని 45 పోలింగ్ స్టేషనలు సిద్ధంగా ఉన్నాయని కోవెలకుంట్ల తహసీల్దారు జయప్రకాష్ అన్నారు. శుక్రవారం ఆయన తహసీల్దారు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌లలో బీఎల్‌వోల పేర్లు, సెల్ నెంబర్లు నియోజకవర్గం పేరు తహసీల్దారు పేరు సెల్ నంబరు, ఎస్సై పేరు సెల్ నంబరు సెక్టోరియల్ అధికారి పేరు, వీఆర్‌వోల పేరు 8, 9 పేజీలలో రాయించామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, నీటి వసతి, బాతు రూంలు తదితర వసతులు కల్పించామన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

కోవెలకుంట్ల, మార్చి 15: చంద్రబాబునాయుడతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కోవెలకుంట్ల మండల టీడీపీ అధ్యక్షుడు అమడాల మద్దిలేటి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ 5 ఏళ్ల వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. సీఎం జగన్ పాలనలో మద్యనిషేధం చేయకుండా గ్రామ గ్రామాన బెల్టు దుకాణాలు పెట్టి విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో దూదేకుల పెద్దహుసేనయ్య, రాధాకృష్ణ మూర్తి, రసూల్, నీలంబాబు పాల్గొన్నారు.

కోట్ల గెలుపునకు కృషి చేద్దాం

బేతంచెర్ల, మార్చి 15: డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేసి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు జాకీరుల్లాబేగ్, మురళికృష్ణ, ఫయాజ్, ఖాజా హుశేన్, రాధాకృష్ణ, రామస్వామి, లొడ్డ శేఖర్, లొడ్డ రామమద్దయ్య, గుడిసె మద్దిలేటి, మహేశ్వ రరెడ్డి, నల్లాడి, శివనారాయణ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

సంజామల, మార్చి 15: బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని పార్టీ మండల ఇన్‌చార్జి బత్తుల ప్రతాప్‌రెడ్డి అన్నారు. సంజామల టీడీపీ కార్యాలయంలో బీసీ డిక్లరేషన్‌పై టీడీపీ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ 5 ఏళ్ల కాలంలో బీసీలను అణగదొక్కారన్నారు. బీసీల అభివృద్ధి కోసం ఏర్పాటైన కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి రోడ్డుపాలు చేశారన్నారు. తోకల మద్దిలేటి, పెద్ద ఓబుళరెడ్డి, పొంతాల చంద్రశేఖర్, మల్కిహుసేన్, పొంతాల రామకృష్ణుడు, మోటారు నాగేశ్వరరావు, మాధవ, సానం రవి, సుబ్బారావు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.9.73 లక్షలు

చాగలమర్రి, మార్చి 15: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలోగల చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల్లో గల హుండీని శుక్రవారం ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఈవో నర్సయ్య ఆధ్వర్యంలో లెక్కించారు. 5 నెలల 27 ఏడు రోజులకు గాను రూ.9.73 లక్షలు ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణాధికారి మారుతి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వి.మాధవాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో వైసీపీకి భారీ షాక్

టీడీపీలో చేరిన గంగుల కుటుంబీకులు



మాజీ మంత్రి అఖిలప్రియ ఆధ్వర్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో చేరిన గంగుల కుటుంబీకులు

నంద్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆళ్లగ డ్డ వైసీపీ ఎమ్మెల్యే బిజేం ద్రారెడ్డి చిన్నాన్న కుమా రులు గంగుల పృథ్వీరా జారెడ్డి, గంగుల విజయసింహారెడ్డి హైదరాబాదులో మాజీ మంత్రి అఖిలప్రియ దంపతులు, గంగుల మేన మామ బద్రి సుధాకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబు సమ క్షంలో టీడీపీలో చేరారు. అలాగే మాజీ మంత్రి ఎస్వీసుబ్బారెడ్డి కుమా రుడు, అఖిలప్రియ మేనమామ ఎస్వీ ప్రసాదరెడ్డి, పడకండ్ల రామకృ ష్ణారెడ్డి చంద్రబాబు సమక్షంలో చేరారు.

వైసీపీకి షాక్

» మాజీ ఎమ్మెల్యే బీసీ సమక్షంలో టీడీపీలో చేరిన 75 కుటుంబాలు

బనగానపల్లె, మార్చి 15: బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. శుక్రవారం కొలిమిగుండ్ల మండల తోళ్లమడుగు, తిమ్మనాయునిపేట గ్రామాలకు చెందిన 75 కుటుంబాలు వైసీపిని వీడి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. బీసీ వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ నాయ కుడు ఐవీ ఫక్కీరారెడ్డి, కొలిమిగుండ్ల టీడీపీ నాయకులు అంబటి జయలక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో తోళ్లమడుగు ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసులు, పెద్దరాజు, బాలసుంకన్న, సుందరయ్య, శాంతయ్య విష్ణు, కొండపల్లి సురేశ్‌తో సహా 25 కుటుంబాలు, తిమ్మనాయునిపేట గ్రామానికి చెందిన శేషఫణిశెట్టి, హరిబాబుశెట్టి, చిన్నపాపోడు, మహమ్మద్, సిలార్, గంధం కిట్టు, తదితర 50 కుటుంబలు వైసీపీని వీడి బీసీ సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో రాష్ట్రం లో నూతనంగా టీడీపీ, జనసేన. బీజెపీ ప్రభుత్వం ఏర్పడబోతోందన్నారు. టీడీపీలో చేరిన అందరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. టీడీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుప డిందన్నారు. చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్ర మంలో టీడీపీ శ్రేణులు, బీసీ అభిమానులు పాల్గొన్నారు.

సీఎం ఇంటి పట్టాల గురించి మాట్లాడడం హాస్యాస్పదం: బీసీ

బనగానపల్లె పట్టణంలో నిర్వహించిన బహిరంగ సమావేశంలో సీఎం జగన్ పట్టణానికి సంబంధించిన ఇంటి పట్టాల విషయం ప్రస్తా వించడం హాస్యాస్పదంగా ఉందని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో ఇంటి పట్టాలకు తాను అడ్డుపడుతున్నానని సీఎం జగన్ మాట్లాడారని, ఆయనకు ఈ విషయం తెలుసా? అని బీసీ సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వం వైసీపీదే కదా ఎందుకు పట్టాలు ఇప్పించలేకపోయారని సీఎంను బీసీ ప్రశ్నించారు. తాను బనగానపల్లెలోని ఎస్సార్బీసీ బఫర్‌జోన్‌లో పట్టాలు ఇస్తే ఎస్సార్బీసీ కాల్వ కట్ట తెగి అమాయకులు ప్రాణాలు కోల్పోతారని, బఫర్‌జోన్‌లో కాకుండా మిగతా ప్రాంతంలో అర్హులైన పేదలకు ఇంటిపట్టాలు ఇవ్వాలని తాను కలెక్టరుకు 2022 అక్టోబరులో అఫడవిట్ సమర్పించానని అన్నారు. బఫర్‌జోన్ ప్రాంతంలో వైసీపీ నాయకులు ప్లాట్లను అమ్ముకొని రూ. 2.5 కోట్ల నుంచి రూ.3కోట్ల వరకు ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ముడుపులు తీసుకున్న విషయం సీఎం జగన్‌కు తెలుసా? అని బీసీ ప్రశ్నించారు. వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం కనీసం ఆస్పత్రిని కూడా సందర్శించకపోవడం దారుణమన్నారు. ఆస్పత్రికి అవసరమైన డాక్టర్లు గాని, సిటీ స్కాన్‌గాని, ఎంఆర్ఐ సౌకర్యం గాని లేకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేదవాడని డబ్బులు లేవని సీఎం చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, బురానుద్దీన్, గౌండాబాబు, అహమ్మద్‌హుస్సేన్, అబిరుచి మధు, రజాక్, గడ్డం అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

ముగిసిన ఇంటర్ పరీక్షలు



విజయ కేతనం చూపిస్తున్న విద్యార్థినులు

చాగలమర్రి, మార్చి 15: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ముగిశాయి. పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఆనందంతో గంతులు వేస్తూ కేరింతలు కొట్టారు. విద్యార్థినులు విజయకేతనం చూపుతూ ఆనందం వ్యక్తం చేశారు. బై బై అంటూ ఒకరినొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. పరీక్షలు పూర్తి కావడంతో కేజీబీవీ హాస్టల్‌లో ఉండే విద్యార్థినులు తమ గ్రామాలకు వెళ్లారు.

పది పరీక్షల ఏర్పాట్లు పూర్తి

చాగలమర్రి, మార్చి 15: మండలంలో ఈనెల 18 నుంచి పదోతరగతి పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల శుక్రవారం తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 310 మంది విద్యార్థులు, బాలికల ఉన్నత పాఠశాలలో 242 మంది, సెయింట్ ఆన్స్ పాఠశాలలో 254 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

18 నుంచి ఒంటిపూట బడులు: ఈనెల 18వ తేదీ నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఒంటిపూట బడులు నిర్వహించాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల సూచించారు. శుక్రవారం వారు మాట్లాడారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డోన్ సబ్‌కోర్టు న్యాయాధికారి తంగమణి

డోన్(రూరల్), మార్చి 15: వినియోగదారులు చట్టాలపై అవగాహన ఉండాలని డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సబ్ కోర్టు వద్ద ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వినియోగదారుల హక్కులను చైతన్యపరిచే కరపత్రాలను డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం వినియోగదారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమం సమగ్ర వినియోగదారుల సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు సాదనగిరి రామక్రిష్టారెడ్డి, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫి, న్యాయవాదులు హరూన్, గోపాల్ రెడ్డి, యోగా నందరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రేస్ కేంద్ర బృందం సర్వే

కొలిమిగుండ్ల, మార్చి 15: కొలిమిగుండ్ల మండలం గ్రేస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వే కేంద్ర బృందం శుక్రవారం విస్తృత సర్వే ఎంఈవో అబ్దుల్ కలామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బడి బయట ఉన్న బడి ఈడుపిల్లల విషయంలో ఈ బృందం సర్వే నిర్వహించారు. అంకిరెడ్డి పల్లె, బెలుం, తిమ్మనాయిని పేట, కొలిమిగుండ్ల, కనకాద్రి పల్లె, చింతలాయి పల్లె, అబ్దుల్లా పురం, పెట్టికోట, గోర్విమాను పల్లె, ఎర్రగుడి, పెద్దవెంతుర్ల గ్రామాలలో ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో గతంలో బడి బయట ఉన్న బడిఈడు పిల్లలు పిల్లలను బడిలో చేర్పించారు. సర్వే ప్రతినిధి బృందం సభ్యులు సమీర్, చంద్రరవి తేజ, రమీజ్ విద్యాహక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కార్యాలయ సిబ్బంది కాంతారావు, ఐఈఆర్‌టి నూర్‌బాషా, సీఆర్‌పీ మద్దిలేటి పాల్గొన్నారు.

జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నాగరాజు

డోన్(రూరల్), మార్చి 15: జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ఏఈ నాగరాజు నియమితులయ్యారు. నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్ర వారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డోన్ పట్టణం కొండపేటకు చెందిన ఏఈ నాగరాజుకు విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వెంకటరమణ నియామక పత్రాన్ని నాగరాజుకు అందజేశారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మహేంద్ర

ప్యాపిలి, మార్చి 15: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా జలదుర్గం గ్రామానికి చెందిన మహేంద్రను నియమిస్తూ శుక్రవారం ఆ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మహేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.


రూ.50 కోట్లతో టెర్మినల్ మార్కెట్

ప్యాపిలి, మార్చి 15: పట్టణంలో రూ.50 కోట్లతో టెర్మినల్ మార్కెట్ నిర్మాణం చేపట్టనున్నట్టు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్యాపిలి పట్టణ సమీపంలోని నక్కరాళ్ల గుట్ట సమీపంలో మార్కెట్ నిర్మాణం కోసం మంత్రి భూమి పూజ నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన అంబేద్కర్, దివంగత నేత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, లాల్‌బహదూర్ బుగ్గన శేషారెడ్డి విగ్రహాలను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు, నాయకులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో అభివృద్ధి చేశా

డోన్, మార్చి 15: ప్రజల సహకారంతోనే డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి బుగ్గన, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్ని శాఖల అధికారులతో కృతజ్ఞత సభ నిర్వహించారు. అనంతరం కేవీఎస్ పార్కులో యోగా సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఆర్డీవో మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జయరాం, తహసీల్దార్ మాధవక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను చదివించండి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

బేతంచెర్ల, మార్చి 15: తల్లిదండ్రులు తమపిల్లలను చదివించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.తిప్పమ్మ, కె.రాధమ్మలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సీతారామాపురం అంగన్‌వాడీ కేంద్రం-1, బలపాలపల్లె కేంద్రం -2లో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అలాగే పోషకాహారం, చిరుధాన్యాల గురించి బాలింతలు, గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, శివలక్ష్మి, లక్ష్మీదేవి, శోభ, రమణమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

డోన్(రూరల్), మార్చి 15: డోన్ సెబ్ స్టేషన్ పరిధిలోని శుక్రవారం నాటుసారా స్థావరాలపై సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి నాటుసారాను సీజ్ చేసి సారా విక్రేతలపై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు డోన్ సెబ్ సీఐ జయనాథరెడ్డి, సెబ్ ఎస్ఐ సోమశేఖర్‌రావుతో కలిసి డోన్ సెబ్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. డోన్ పట్టణం తారకరామనగర్‌లో ఆలంబీ నాటుసారా విక్రయిస్తుండగా.. దాడులు చేసి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ అధికారులు తెలిపారు. అదే తారకరామనగర్‌లో శ్రీనివాసగౌడు అనే సారా విక్రేత నుంచి 20 లీటర్ల నాటుసారాపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే డోన్ మండలం తిమ్మాపురం గ్రామంలో శివక్రిష్ణ అనే వ్యక్తి నాటుసారా విక్రయిస్తుండగా.. దాడులు చేసి 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలోని చింతలపేట గ్రామంలో రామక్రిష్ణ అనే సారా విక్రేత నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ప్యాపిలి మండలం బావిపల్లెలో సారా విక్రేత నుంచి 5 సిల్వర్ విస్కీ మద్యం బాటిళ్లను, 12 కింగ్ ఫిషర్స్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.40వేలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సెబ్ పోలీసు అధికారులు తెలిపారు. అలాగే పాతకేసులలో పట్టుబడిన నాటుసారా మద్యంను ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. 13 నాటుసారా కేసులలో పట్టుబడిన 350 లీటర్ల సారాను, 10 కేసులలో పట్టుబడిన 108 అక్రమ మద్యం బాటిళ్లను, ఇతర రాష్ట్రాలకు సంబంధించి 470 మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నాటుసారాతోపాటు నిందితులను చూపుతున్న పోలీసులు

మద్యం పట్టివేత

నంద్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట వద్ద మద్యం అమ్ముతున్న పేరాయిపల్లెకు చెందిన జాఫర్, బ్రహ్మయ్యను శుక్రవారం అరెస్టు చేసి 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ నరసింహులు చెప్పారు. సమాచారం మేరకు పేరాయిపల్లె మెట్ట కాశీనాయన ఆశ్రమం పక్కన ఉన్న కంపచెట్లలో మద్యం అమ్ముతుండగా దాడి చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన ఏఎస్ఐ రామిరెడ్డి, పీసీ పూర్ణ చంద్రరాజులను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

'ఎన్నికల నియమావళిని అమలు చేయాలి'

నంద్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ఎన్నికల నియమావళిని సక్రమంగా అమలు చేయాలని నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డి ఆదేశించారు. ఆళ్లగడ్డ తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం పోలీసు అధికారులతో, తహసీల్దార్లతో, బీఎల్వోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని, పోలింగు బూతుల్లో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ షర్ఫుద్దీన్, ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రెండు నామినేషన్లు దాఖలు: ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపికకు జరుగుతున్న ఎన్నికల్లో శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారులు బాలగురెడ్డి, నాగేశ్వరరెడ్డి చెప్పారు. కార్యదర్శి పదవికి అంబటి గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్ష పదవికి నరసింహారెడ్డి తమ నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

చాగలమర్రి, మార్చి 15: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని 212 బూత్ పరిధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో గురించి వివరించారు. అనంతరం 25 కుటుంబాలు భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో నాయకులు భార్గవ్‌రామ్ నాయుడు, అన్సర్ బాషా, నరసింహారెడ్డి, సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌కు ప్రశంసలు

రుద్రవరం, మార్చి 15: దేశ ప్రధాని మోదీ ప్రశంసలు తెలుపుతూ శుక్రవారం సందేశం అందినట్లు రుద్రవరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వర్‌రావుకు తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరీక్ష పే చర్చ 2023 కార్యక్రమంలో భాగంగా దేశ ప్రధాని నమోదీ విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ఢిల్లీలోని కలకతోర స్టేడియంలో విద్యార్థులతో మోదీ మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వేలాది మంది ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీక్షించారు. దీనిలోభాగంగా రుద్రవరం ఆదర్శ పాఠశాల నుంచి దాదాపు 400 మంది విద్యార్థులు పరీక్ష పే చర్చలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ప్రశంసా పత్రం మెయిల్ ద్వారా అందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రిన్సిపాల్‌ను సిబ్బంది అభినందించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

బనగానపల్లె, మార్చి 15: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నును శుక్రవారం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస శిక్షకుడు సాయికుమార్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. వ్యాయామ విభాగ అధ్యాపకురాలు విజయకుమారి మాట్లాడుతూ వినూత్న ఆలోచనలతో విద్యా ర్థుల్లో మార్పు చెంది ఉన్నతస్థానాల్లోకి రావాలన్నారు. అధ్యాపకులు, బాబునాథ్, సూర్యనారాయణరెడ్డి, బడేసాహెబ్, వసుందర, ఉమామహేశ్వరరెడ్డి, రామకృష్ణ, రవికుమార్, కౌసల్య, రామన్న, నాగతిమ్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

చాగలమర్రిలో ఇఫ్తార్

చాగలమర్రి, మార్చి 15: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి చాగలమర్రి ఈసూబ్ మసీదులో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ విందులో పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు. రంజాన్ మాసం ప్రారంభంలో మొదటి శుక్రవారం సందర్భంగా సుభహాన్ మౌలాన ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అగ్ని ప్రమాదంలో 180 మామిడి చెట్లు దగ్ధం



కాలిపోయిన మామిడి చెట్లు

రుద్రవరం, మార్చి 15 : మండలంలోని టి.లింగందిన్నె గ్రామం రెవెన్యూ పరిధిలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని 180 మామిడి చెట్లు కాలిపోయాయని శుక్రవారం బాధిత రైతు తిరుమలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలయ్యతో పాటు లక్ష్మమ్మ, శేషమ్మలకు చెందిన మామిడి వృక్షాలు కూడా కాలిపోయాయి. మూడేళ్ల క్రితం మామిడి మొక్కలు నాటి, కష్టపడి పెంచుకున్నారు. పూత పిందెల సమయంలో కాలిబూడిదయ్యాయి. ఒక్కో రైతువి 60 మామిడి చెట్లు చొప్పున 180 మామిడి చెట్లు కాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

గడ్డి వాములు..

నంద్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని రామలక్ష్మీకొట్టాలలో శుక్రవారం ప్రమాదవశాత్తు ఐదు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువులకు ఏడాది పొడవు గ్రాసం కొరత ఉండకూడదన్న ఆలోచనతో సేకరించుకున్న గడ్డివాములు కాలిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

25 కుటుంబాలు టీడీపీలో చేరిక

రుద్రవరం, మార్చి 15 : మండలంలోని మందలూరు గ్రామంలో నంద్యాల రామశేఖర్‌రెడ్డి, రామగోపాల్‌రెడ్డితో 25 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జగత్ విఖ్యాత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల చూపు టీడీపీ వైపు మళ్లిందన్నారు. రాష్ట్రంలో రాక్షసపాలనకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎల్వీ రంగనాయకులు, అల్లాడి చంద్రశేఖర్, బంగారు రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి ఎమ్మెల్యే కాటసాని బంధువు



చంద్రబాబు, బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు వంగల పరమేశ్వర్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 15: అవుకు మండలం కోనాపురం గ్రామానికి చెందిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమీప బంధువు వంగల పరమేశ్వర్‌రెడ్డి శుక్రవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. వంగల పరమేశ్వరరెడ్డి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోదరుడు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి సొంత బావ మరిది. ఈయన గత కొంత కాలంగా వైసీపీ పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డితో కలసి అమరావతి వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా వంగల పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నచ్చక టీడీపీలో చేరినట్లు తెలిపారు.

కేంద్ర బలగాల కవాతు

కొలిమిగుండ్ల, మార్చి 15: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన పెట్నికోట, గొర్విమానుపల్లె, కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, చింతలాయపల్లె గ్రామాల్లో శుక్రవారం సీఐ గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ప్రజలు ఎలాంటి గొడవలకు దిగకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.

నంద్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలో శుక్రవారం పోలీసు, బీఎస్ఎఫ్ జవానులు కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా, ఎన్నికల పోలింగ్‌లి సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూస్తామని భరోసా కల్పిస్తూ పట్టణంలోని తొమ్మండ్రు, కొత్త మసీదు, లింగమయ్య, జమునా, గీతా, విద్యాసాగర్, ఎస్వీ ప్యాలెస్ వీధులలో కవాతు నిర్వహించారు. పట్టణ సీఐ రమేష్‌బాబు, పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి, బీఎస్ఎఫ్ ఎస్ఐ నిధికుమార్, పోలీసు సిబ్బంది, జవాన్లు పాల్గొన్నారు.



కొలిమిగుండ్ల: కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు